## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ మెంబర్‌గా శరగడం



సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శరగడం చినఅప్పలనాయుడును పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### జీఎస్టీ సంస్కరణలతో రైతులకు మేలు



జీఎస్టీ అవగాహన ర్యాలీలో వ్యవసాయ అధికారులు, గ్రామ పెద్దలు

సబ్బవరం: ప్రభుత్వం ఇటీవల చేసిన జీఎస్టీ సంస్కరణలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని, రైతుల కొనుగోలు శక్తి పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రం సబ్బవరంలో జీఎస్టీ సంస్కరణలపై శుక్రవారం రైతులకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమయ్యే ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, డ్రిప్, స్ప్రింక్లర్లు తదితర కొనుగోళ్లలో రైతులకు భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పీఏసీఎస్ డైరెక్టర్లు పల్లా తాతారావు, కోరాడ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పోతల నాయుడు, ఆకుల గణేష్, వీఏఏ దుర్గ ప్రసాద్, సాయిచంద్రిక, భావన తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ తీగ తగిలి పాడి గేదె మృతి



మృతి చెందిన పాడి గేదె

పరవాడ: మండలంలోని రావాడ గ్రామంలో మోటూరు రమణకు చెందిన పాడి గేదె విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది. గ్రామ పొలిమేరలో శుక్రవారం ఉదయం మేత మేస్తుండగా వేలాడుతున్న విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతు రమణ వాపోయాడు. రావాడ శివారు రేకవానిపాలెంలో ఇటీవల విద్యుత్ తీగ తగిలి ఓ పాడి గేదె మరణించింది. గ్రామంలో వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా వరుస ప్రమాదాలు జరుగుతున్నా ఈపీడీసీఎల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండల వైస్ ఎంపీపీ బందనం నాగేశ్వరరావు ఆరోపించారు. బాధిత రైతు రమణకు ఈపీడీసీఎల్ అధికారులు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

### అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 105 మద్యం బాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితునితో పోలీసులు

పెందుర్తి: పెందుర్తి పరిధిలోని గవర జగ్గయ్యపేటలో పవన్‌సాయి వైన్ షాపు సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు. ముందస్తు సమాచారం మేరకు ఏఎస్ఐ బి.కాశీప్రసాద్ మిగిలిన సిబ్బందితో పాటు సీటీఎఫ్ సిబ్బంది సహాయంతో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బింగినెడి శ్రీను(50)ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 105 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యల నేపథ్యంలో కోర్టుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

### పసుపు, కుంకుమల పంపిణీ

అగనంపూడి: విజయదశమి, జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని 79వ వార్డు అగనంపూడికి చెందిన మహాత్మా గాంధీ సేవా సమితి చైర్మన్ చిత్తా రామారావు సహకారంతో బొర్రమాంబ పారాయణ సేవా సమితికి చెందిన 50 మంది మహిళలకు గాజులు, పసుపు కుంకుమలు అందించారు. మహిళా సంఘం నాయకురాలు గొల్లవిల్లి కనక భవానీ, బొర్రమాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ చేతుల మీదుగా వీటిని అందించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



మంత్రిపాలెం వద్ద పరుజులో ఏర్పడిన భారీ గుంతలు



అనకాపల్లి-విశాఖ రహదారిలో లంకెలపాలెం వద్ద ధ్వంసమైన రోడ్డు



ఎన్టీపీసీ ఫోర్త్ యూనిట్ వద్ద ధ్వంసమైన రోడ్డు

# దారుణ రులు

పరవాడ మండలంలో రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఎక్కడికక్కడ గుంతలతో గ్రామీణ ప్రజలు రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్నారు. సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లని ప్రచారాలు గుప్పించిన కూటమి ప్రభుత్వం.. మరో సంక్రాంతి సమీపిస్తున్నా.. కనీస చర్యలూ చేపట్టలేదు. దీంతో వాహనదారులు ఛిద్రమైన రోడ్లపై రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. అధ్వాన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఎన్నిసార్లు అధికారులకు, నేతలకు మొరపెట్టుకున్నా పట్టించుకోనే నాథుడే లేడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అధ్వానంగా పరవాడ మండలంలోని రోడ్లు
- కనీస మరమ్మతులకూ చొరవ చూపని వైనం
- మరో సంక్రాంతి సమీపిస్తున్నా.. గుంతల్ని పూడ్చని కూటమి

పరవాడ: మండలంలోని గ్రామీణ రోడ్లు దారుణంగా తయారయ్యాయి. అడుగుకో గొయ్యి.. గజానికో గుంతలా మారాయి. ఏ మాత్రం వర్షం పడినా.. గొయ్యేదో.. రోడ్డేదో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత సంక్రాంతికి రోడ్లకు మరమ్మతులు చేపడతామన్న కూటమి ప్రభుత్వం.. కనీస చర్యలకూ చొరవ చూపలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింతగా ఛిద్రమై నరకానికి నకళ్లుగా మారాయి.

- నిత్యం వందల సంఖ్యలో బూడిద, బొగ్గు లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించే లంకెలపాలెం-పెదముషిడివాడ రోడ్డులో చాలా చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. మంత్రిపాలెం పరుజులో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు వాహనదారుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నాయి. భారీ గుంతల్లో పడిన వాహనాలు రిపేర్లకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. బొగ్గు, బూడిద లారీల రాకపోకలతో రోడ్డు అధ్వానంగా మారినా.. అధికారులెవరూ పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పరవాడ-యలమంచిలి రోడ్డులో ఏర్పడిన గుంతలు

- ఎస్ఈజెడ్, ఎన్టీపీసీ, ఫార్మాసిటీ పరిశ్రమల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికులతో రద్దీగా ఉండే పరవాడ-యలమంచిలి రోడ్డు మరీ అధ్వానంగా మారింది. పరిశ్రమలకు బొగ్గును తరలించే భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు గుంతలతో నిండిపోయి ప్రయాణికుల పాలిట నరకంగా మారాయి. చీకటి పడితే రోడ్డులో గుంతల్ని తప్పించే క్రమంలో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఊటగెడ్డ మలుపులో ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.



ఊటగెడ్డ-ఎన్టీపీసీ రోడ్డులో గుంతల్లో చేరిన వర్షపు నీరు

- అనకాపల్లి-విశాఖ జాతీయ రహదారిలో లంకెలపాలెం వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఏమాత్రం వర్షం పడినా రోడ్డులో నీరు నిలిచిపోతోంది. భారీ వాహనాల రాకపోకల సమయంలో రోడ్డు మీదున్న నీరు తుళ్లడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.
- పరవాడ-వాడచీపురుపల్లి రహదారిలో పలు చోట్ల ఏర్పడ్డ భారీ గుంతలు ప్రయాణికుల్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ఈ రోడ్డులో పాత ఇటుకల పరిశ్రమ, ఎన్టీపీసీ ఫోర్త్ యూనిట్ సమీపంలో పడిన భారీ గుంతలు ప్రయాణికుల ప్రాణాల మీదికి తెస్తున్నాయి. రెండేళ్ల క్రితం ఇక్కడ గుంతల్లో పడి దొప్పెర్ల ప్రాంతానికి చెందిన యువకుడు ప్రాణాలు కోల్పోగా, దీపాంజలినగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ చేయి విరిగింది. ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డుపై గుంతల్ని పూడ్చేందుకు ఆర్ అండ్ బీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డును అభివృద్ధి చేయాలి



భారీ వాహనాల కారణంగా అధ్వానంగా మారిన లంకెలపాలెం-పెదముషిడివాడ రోడ్డును అభివృద్ధి చేయాలి. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలు విడుదల చేస్తున్న కాలుష్యంతో ఇబ్బందులు ఎలాగూ తప్పట్లేదు. రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయి. ఎక్కడికక్కడ గోతులతో ప్రమాదాల బారిన పడుతున్నాం. ముందే ఇరుకు రోడ్డు ఆపై అడుగుకో గుంతతో ప్రయాణం నరకంగా మారుతోంది.

– యలమర్తి బుజ్జి, పెదముషిడివాడ

### కనీసం గుంతలైనా పూడ్చండి



గుంతలతో నిండిన పరవాడ-యలమంచిలి, పరవాడ-వాడచీపురుపల్లి రోడ్డులో ప్రయాణించాలంటే భయమేస్తోంది. ఎక్కడ ఏ గుంతలో పడిపోతామోనని ఆందోళనతో వాహనాలను చాలా నెమ్మదిగా నడపాల్సి వస్తోంది. చీకటి పడితే గోతులు కనిపించడం లేదు. వర్షం పడితే గోతుల్లో నీరు చేరి గొయ్యేదో.. రోడ్డేదో తెలుసుకోలేని పరిస్థితి. ఈ రహదారుల్లో కనీసం గుంతల్ని పూడ్చేందుకైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బూసి రామకృష్ణ, వాడచీపురుపల్లి

## అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీ దళాలతో అప్పన్నకు అర్చన చేస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేసి, ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

**వైభవంగా నిత్యకల్యాణం**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

## దట్టంగా పెరిగిన తుప్పలతో తిప్పలు



తంతడి-ముత్యాలమ్మపాలెం రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు

పరవాడ: తంతడి-ముత్యాలమ్మపాలెం రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక మలుపులతో కూడిన రహదారిలో తుప్పలు ఏపుగా పెరగడంతో మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల సీసీ రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పల్ని తొలగించాలని ఇరు పంచాయతీల అధికారులను కోరినా ప్రయోజనం కనిపించలేదని ప్రజలు వాపోతున్నారు.

## మహాత్ముడి ఆశయ సాధనకు కృషి చేయాలి



మండల పరిషత్ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి, తదితరులు



ఇరువాడ పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బలిరెడ్డి కనకరాజు, తదితరులు

సబ్బవరం: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె కార్యాలయ ఆవరణలోని గాంధీ పార్కులోని మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సముపార్జనలో మహాత్ముని సేవల్ని, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, బోను గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని ఇరువాడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బలిరెడ్డి కనకరాజు, బంగారి నాయుడు, సంద్రాన అప్పారావు, బలిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## 'కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తానాంలో శుక్రవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, అధికారం చేపట్టిన తర్వాత హామీలను తుంగలో తొక్కిందన్నారు. సంక్షేమ బోర్డులో కోట్లాది రూపాయలు మూలుగుతున్నా.. వాటిని ప్రభుత్వ అవసరాలకు వాడుకుంటున్నారు తప్ప, సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న 32 రకాల నిర్మాణ కార్మికులకు ఎలాంటి సాయం అందించడం లేదని ఆరోపించారు. ఈ ఏడేళ్ల కాలంలో అనేక మంది కార్మికులు ప్రమాదాలకు గురై వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడితే తప్ప సంక్షేమ బోర్డును కాపాడుకోలేని పరిస్థితి దాపురించిందన్నారు. సమావేశంలో భవన నిర్మాణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.చిరంజీవి, జి.సన్యాసిరావు, రొంగలి కన్నంనాయుడు, పి.ఆర్.నాయుడు, త్రినాథ్, అప్పారావు, శ్రీను, సత్తిబాబు పాల్గొన్నారు.

## సింహగిరిపై మెట్లమార్గం పునరుద్ధరణ



పునరుద్ధరించిన మెట్లమార్గంలో రాకపోకలు సాగిస్తున్న భక్తులు

సింహాచలం : గత చందనోత్సవం రోజున షాపింగ్ కాంప్లెక్స్ సముదాయంలో గోడ కూలిన ప్రదేశంలో, మెట్ల మార్గాన్ని శుక్రవారం నుంచి తిరిగి పునరుద్ధరించారు. గత ఏప్రిల్ 30న జరిగిన చందనోత్సవం రోజున, నాసిరకంగా నిర్మించిన గోడ కూలడం వల్ల ఏడుగురు భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటన తర్వాత మెట్ల మార్గాన్ని మూసివేశారు. ప్రసాద్ స్కీమ్ పనులలో భాగంగా గతంలో నిర్మించిన గోడ నాసిరకంగా ఉండటంతో పాటు, మెట్ల మార్గం ప్రణాళికను మార్చడంపై వైదిక వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఈ నెల 2న జరిగిన విజయదశమి జమ్మివేట ఉత్సవం కోసం దేవస్థానం స్వయంగా టెండర్లు పిలిచి, రూ.24 లక్షలతో మెట్ల పనులను పూర్తి చేసింది. గతంలో ఉన్న ప్రణాళిక ప్రకారమే (జోడుభద్రాల ప్రాంగణం నుంచి బస్టాండ్ ప్రాంగణం వరకు) మెట్ల మార్గాన్ని తిరిగి ఏర్పాటు చేశారు.

## జోనల్ కార్యాలయానికి హౌసింగ్ స్థలం కేటాయించాలి

అగనంపూడి: అగనంపూడి జోన్-9 కార్యాలయం ఏర్పాటుకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సబ్‌నిర్మితి కేంద్రం( హౌసింగ్ బోర్డు) స్థలం కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. తాత్కాలికంగా అగనంపూడిలోని రాజీవ్ గాంధీ కల్యాణ మండపంలో జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భావించారని, శాశ్వత ప్రాతిపదికన భవన నిర్మాణానికి సబ్‌నిర్మితి కేంద్రం ఉన్న స్థలమే సరైనదని నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మొల్లి కోటేశ్వరరావు, శీరంశెట్టి బాబ్జి, సింగిడి సింహాచలం వివరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నేతలు పేర్కొన్నారు.


## అధ్వానంగా కాలువలు.. పీడిస్తున్న దోమలు



కట్టవానిపాలెంలో పూడికలతో నిండిన సీసీ కాలువ

పరవాడ: మండలంలోని భర్నికం శివారు కట్టవానిపాలెం బీసీ కాలనీలో కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. కాలనీలోని సీసీ కాలువ పూడికలతో నిండిపోయింది. దీంతో మురుగు నీరు బయటకు వెళ్లే మార్గంలేక ఎక్కడికక్కడ నిలిచిపోతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాడుక నీరు రోడ్డుపై నిలిచి దోమలు విజృంభిస్తున్నాయని, విషజ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. మంచినీటి ట్యాంకు వద్ద స్థానికులు తమ పెంపుడు గొర్రెలు, మేకలను కట్టడడం వలన ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారి దోమలు మరింత పెరిగిపోతున్నాయని చెప్పున్నారు. బీసీ కాలనీలో మురుగు నీరు పోయే వీల్లేదని, సీసీ కాలువ ఏర్పాటు చేయాలని అధికారుల్ని వేడుకుంటున్నా.. పట్టించుకోవట్లేదని వాపోతున్నారు. కాలనీ వాసులు వాడుక నీరు రైతుల సాగు భూముల్లోకి వెళ్తుండటం వల్ల తరచూ ఘర్షణలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కాలనీ సమీపంలో నిర్మించిన సీసీ కాలువలో స్థానికులు చెత్తాచెదారం వేయడం, కాలువ చుట్టూ తుప్పలు మొలిచి మురుగు నీరు ప్రవహించే వీల్లేకుండా పోయిందన్నారు. పూడికలతో నిండిన కాలువలను శుభ్రం చేసేందుకు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది కనీస చర్యలూ తీసుకోవట్లేదని ఆరోపిస్తున్నారు. కాలువలో పూడికలను తొలగించి మరో కాలువ నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.


## ఆత్మహత్యాయత్నం చేసిన హోంగార్డు చికిత్స పొందుతూ మృతి



అప్పలనాయుడు(ఫైల్)

పెందుర్తి: మండలంలోని వేపగుంట ముత్యమాంబ కాలనీకి చెందిన హోంగార్డు ఆత్మ హత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. స్థానిక సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు. హోంగార్డు రుద్ర అప్పలనాయుడు(43) విశాఖ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 30న రాత్రి ఆర్థిక సమస్యలపై భార్య కల్యాణితో మాట్లాడారు. అనంతరం బెడ్‌రూమ్‌కు వెళ్లి, లోపలి నుంచి తలుపులు వేసుకుని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. కిటికీ నుంచి చూసిన భార్య అరిచి సహాయం కోరగా ఇరుగుపొరుగు వారు వచ్చి బలవంతంగా తలుపులు తెరిచారు. ఉరిని తొలగించి, గోపాలపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో విశాఖలోని కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. భార్య రుద్ర కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

## ఖైదీలు సోదర భావంతో మెలగాలి





ఖైదీకి బహుమతి అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు, కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: కారాగారంలోని ఖైదీలంతా సోదర భావంతో కలిసి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు అన్నారు. విశాఖ కేంద్ర కారాగారంలో గురువారం గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. గాంధీ జయంతినే ఖైదీల సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు ఖైదీలకు పలు పోటీలు నిర్వహించారు. ఖైదీలు వివిధ వేషధారణలో ప్రదర్శించిన నాటికలతో అతిథులను అలరించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను అనుసరించి మెలగాలని ఖైదీలకు సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ శాంతియుత సమాజం దిశగా అందరూ నడుచుకోవాలన్నారు. కారాగారం శిక్షణాలయమని, ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగి బయటకు వెళ్లిన తర్వాత ఉన్నతంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో జైల్ పర్యవేక్షణాధికారి ఎస్.సాయిప్రవీణ్, జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలనగర్‌కు స్వచ్ఛభారత్ అవార్డు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ స్వచ్ఛ భారత్ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రకటించింది. ఈ అవార్డును ఈ నెల 6న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ అందుకుంటారని కాలనీ వాసులు తెలిపారు. తిరుమలనగర్‌కు ఆర్‌డబ్ల్యూఏ కేటగిరీలో స్వచ్ఛకాలనీగా ఎంపిక చేశారు. 2001లో ఆవిర్భవించిన తిరుమలనగర్‌లో నివాసులు 2005లో సంఘంగా ఏర్పడి పలు స్వచ్ఛంద సేవల ద్వారా కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుంటున్నారు.